సమస్యల బడి

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- మోగనున్న బడి గంట
- మౌలిక సదుపాయాలు దూరం
- నెల్లిమర్ల నియోజకవర్గంలో 294 పాఠశాలలు
- చివరి దశలో నిలిచిపోయిన నాడు నేడు పనులు
- నిధులున్నా ముందుకు సాగని భవన నిర్మాణాలు


రామతీర్థం ఉన్నత పాఠశాలలో చివరి దశలో నిలిచిపోయిన భవనాలు

నెల్లిమర్ల రూరల్/పూసపాటిరేగ: ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 12న గురువారం నుంచి పాఠశాలలు తెరచుకోనున్నాయి. బడి గంట మోగనుంది. నెల్లిమర్ల నియోజకవర్గంలో 294 ప్రభుత్వ పాఠశాలలు వున్నాయి. వాటిలో 21,591 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలో నాడు-నేడు పథకం కింద మంజూరైన పాఠశాలల అదనపు భవనాలకు గ్రహణం పట్టింది. నాడు-నేడు రెండో విడతలో మొత్తం 49 పాఠశాల్లో సుమారు రూ.10.24 కోట్ల అంచనా నిధులతో 10 కాంపోనెంట్ పనులతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనుల కోసం సుమారు రూ.9.10 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో సుమారు రూ.5.56 కోట్లను ఖర్చు పెట్టి అదనపు భవన నిర్మాణాలు చేపట్టింది. తరువాత ప్రభుత్వం మారడంతో సుమారు ఆరు పాఠశాలల్లో పనులు చివరి దశలో నిలిచిపోయాయి. ఖాతాల్లో నిధులున్నప్పటికీ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. రామతీర్థం, సతివాడ ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో అదనపు భవనాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని తల్లిదండ్రులు వాపోతున్నారు. రామతీర్థం ఉన్నత పాఠశాలలో 1 నుంచి పదో తరగతి వరకు సుమారు 378 మంది విద్యార్థులు ఉండగా..12 తరగతి గదులు ఉన్నాయి. నాలుగు అదనపు భవనాలు మంజూరు కాగా చివరి దశలో పనులు నిలిచిపోయాయి. సతివాడ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి 10 వరకు సుమారు 352 మంది విద్యార్థులుండగా ఎనిమిది తరగతి గదుల్లో విద్యార్థులు సర్దుకుంటున్నారు. ఇక్కడ కూడా నాలుగు అదనపు భవనాల పనులు చివరి దశలో నిలిచిపోయాయి. తరగతి గదులు చాలకపోవడంతో విద్యార్థులు వరండాల్లోనూ, అసంపూర్తి భవనాల్లోను చదువులు సాగిస్తున్నారు.


ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రాథమిక పాఠశాల పినతరిమి గ్రామంలోనిది. రెండు తరగతి గదులు ఉండగా..ఒక భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఉపయోగించడం లేదు. ఉన్న ఒక్క గదిలోనే విద్యార్థులకు చదువు చెబుతున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5 వరకు సుమారు 52 మంది విద్యార్థులు చదువుతుండగా.. వరండాతో పాటు ఆ ఒక్క గదిలోనే అన్ని తరగతుల పిల్లలకు బోధన సాగిస్తున్నారు. మధ్యాహ్న భోజన వంట గది కూడా పూర్తిగా శిథిలమైంది.

బొప్పడాంలో వెక్కిరిస్తున్న బాత్‌రూమ్‌లు


ఈ చిత్రం బొప్పడాం బీసీ బాలుర వసతిగృహంలో బాత్‌రూమ్‌లు. డోర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు నెలల క్రితం వసతిగృహంలో మౌలిక వసతుల కల్పనకు సర్వశిక్ష అభియాన్ నుంచి రూ.5లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ పనులు చేపట్టకపోవడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో కూడా ఇబ్బందులు తప్పేలా లేవు. వసతిగృహంలో గదులకు కిటికీలు, రన్నింగ్ వాటర్ సదుపాయం లేక తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా వివరాలు		
మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పూసపాటిరేగ	84	5748
నెల్లిమర్ల	71	7229
డెంకాడ	67	3842
భోగాపురం	72	4772

న్యాయశాఖ హెచ్చరించినా ..


ఇటీవల మొయిద బీసీ బాలుర వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహ ప్రారంభంలో ప్రహరీ పూర్తిగా శిథిలమవ్వడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రహరీ నిర్మాణానికి ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. అయినప్పటికీ ప్రహరీ గోడ నిర్మాణానికి అడుగులు ముందుకు పడలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రహరీ లేకపోవడంతో తమ పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలకు దూరం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మౌలిక సదుపాయాలకు దూరంగా గడుపుతున్నారు. చాలా పాఠశాలల్లో తాగునీటి సమస్య, మరుగుదొడ్ల సమస్య వుంది. చాలా వరకు తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా వున్నాయి. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

– బి.సూర్యనారాయణ, పూసపాటిరేగ

ఫీజులపై నియంత్రణ వుండాలి

విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజులు నియంత్రణ వుండాలి. ప్రైవేటు పాఠశాలలో అడ్డూ అదుపు లేకుండా ఫీజులు పెంచారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను పర్యవేక్షణ చేసి ఫీజులపై తనిఖీలు నిర్వహించాలి.

– వి.మురళి, పతివాడ

క్లుప్తంగా

చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి పౌర్ణమి పురస్కరించుకుని వనంగుడి, చదురుగుడిల ఆవరణలలో బుధవారం వేదపండితులు శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. సుమారు మూడున్నర గంటల పాటూ చేసిన యాగంలో యాగ విశిష్టతను వేదపండితులు అచ్యుతశర్మ, సాయికిరణ్‌లు భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నేతేటి ప్రశాంత్ , తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిణిగా సంగీత


ఏవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సంగీత

డెంకాడ: మండల వ్యవసాయాధికారిణిగా తిరుమరెడ్డి సంగీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం రైతు శిక్షణ కేంద్రంలో ఏవోగా పని చేసిన సంగీత బదిలీపై డెంకాడకు వచ్చారు.

విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు


పినవేమలి ఒడ్డు పోలమ్మ ఆలయం వద్ద వైర్లపై వేలాడుతున్న తాటి చెట్టు

విజయనగరం ఫోర్ట్: మండలంలోని పినవేమలి ఒడ్డుపోలమ్మ ఆలయం వద్ద విద్యుత్ వైర్లపై తాటి చెట్టు పడడంతో వైర్లు కిందకు వేలాడుతూ భయపెడుతున్నాయి. దీని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు, ఆలయానికి వచ్చే భక్తులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న జై భీమ్‌రావు భారత్ పార్టీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: హామీల అమల్లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని సతివాడలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం తీరా గెలిచాక చేతులెత్తేసిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. బీసీ ఉప కులాలకు 50 ఏళ్లకు, ఎస్సీ కులాలకు 40 ఏళ్లకు పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఇంచార్జ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా జ్యేష్టాభిషేకాలు


స్వామి సన్నిధిలో జ్యేష్టాభిషేకాలు జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో జ్యేష్టాభిషేకాలను అర్చకులు బుధవారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించి..జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామి సన్నిధిలో నవకలశారాధన జరిపించారు. ఆ కలశాలను దేవాలయంలో ప్రదక్షిణ పూర్వకంగా తీసుకువెళ్లి శ్రీరాముడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో స్నపన మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు


విజయనగరం-విశాఖ జాతీయ రహదారిపై రేడియం రిఫ్లక్షన్ స్టడ్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

డెంకాడ: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు భోగాపురం సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని ప్రధాన కూడళ్లలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. భోగాపురం సీఐ రామకృష్ణ, ఎస్ఐ సన్యాసినాయుడు భద్రత చర్యలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. నేషనల్ హైవే ఆథారిటీ సహకారంతో విజయనగరం – విశాఖ జాతీయ రహదారిలో రేడియం రిఫ్లక్షన్ స్టడ్స్‌ను అతికించామని తెలిపారు. మోదవలస నుంచి చింతలవలస వరకూ వీటిని ఏర్పాటు చేశామని వివరించారు. ప్రమాద స్థలాలను గుర్తించి వాటిని వద్ద ప్రమాదాల నివారణకు పలు రకాల హెచ్చరికలు ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం కావాలి


శాఖా గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

డెంకాడ: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే కేంద్రాలని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని డెంకాడ గ్రామంలో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన శాఖా గ్రంథాలయం నూతన భవనాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు గ్రంథాలయాలు కూడా ఆధునీకరించడం జరుగుతుందన్నారు. అందువలన విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన విజ్ఞానాన్ని కూడా గ్రంథాలయాల్లో పొందవచ్చని వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, పాణిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ నూతన ఫీడర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని మోదవలసలో ఉన్న రాజపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన పలు ఫీడర్లను ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో పెద్దగా అంతరాయం కలగకుండా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మాజీ సర్పంచ్ కనకల రామారావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలి


బకాయి పడ్డ దుకాణాలను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

విజయనగరం: నగరపాలక సంస్థ అధీనంలో ఉన్న అద్దె షాపుల బకాయిలను వెంటనే చెల్లించాలని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాలలో ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి బకాయి పడ్డ అద్దెలను చెల్లించాలని కోరారు. అధిక మొత్తంలో అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 – 26 ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తంగా 5.40 కోట్ల రూపాయలు అద్దెల వసూలు లక్ష్యంగా ఉందన్నారు. అయితే గత ఆర్థిక సంవత్సరంలో 1.35 కోట్ల రూపాయలు బకాయిలు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4.05 కోట్ల రూపాయలు వసూలు లక్ష్యంగా ఉందన్నారు. ఏప్రిల్, మే నెలలో రూ.55 లక్షలు అద్దెలను వసూలు చేసినట్లు చెప్పారు. ప్రజావసరాలను తీర్చేందుకు, మెరుగైన పౌర సేవలు అందేందుకు, పన్నులు, అద్దెలను తక్షణమే చెల్లించాలని కోరారు. బకాయిలను చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు చిన్నం నాయుడు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

విజయనగరం క్రైమ్: విజయనగరం మండలంలోని గొల్లలపేటకు చెందిన ఓ బాలిక కనిపించడం లేదని తల్లి రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. అందిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన తమ బిడ్డ ఇప్పటి వరకు తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

నెల్లిమర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. రహదారి భద్రత కోసం నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు రూరల్ ప్రాంతంలో పలు చోట్ల హోర్డింగ్‌లు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక నిబంధనలు పాటించాలని కోరారు. రామతీర్థం జంక్షన్, మొయిద జంక్షన్, పోలీస్‌స్టేషన్, జరజాపుపేట తదితర చోట్ల ఎస్పీ ఆదేశాల మేరకు రహదారి భద్రత హోర్డింగ్‌లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి వేదగాయత్రీ మాత ఆలయ వార్షికోత్సవాలు

విజయనగరం టౌన్: స్థానిక పద్మావతీనగర్ మూడో లైన్‌లో కొలువైన శ్రీ లక్ష్మీగణపతి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి నవగ్రహ, వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమేత శ్రీవేద మాత గాయత్రీదేవీ ఆలయ 11వ వార్షికోత్సవాలు ఈ నెల 12న గురువారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న శనివారం వరకూ కార్యక్రమాలు ఉంటాయన్నారు, 12న దీక్షాకంకణ ధారణ, హోమాలు, 13న మండపారాధన, చండీహోమాలు, పూర్ణాహుతి, పారాయణాలు, 14న వేదమాత గాయత్రీదేవీ మూలవిరాట్‌కు అభిషేకాలు, అన్నప్రసాద వితరణ, సాయంత్రం నక్షత్రహారతి, ఉయ్యాల సేవ ఉంటుందన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

బీటీ రహదారి ప్రారంభం

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట నుంచి కొండ్రాజుపాలెం గ్రామం వరకు నిర్మాణమైన బీటీ రహదారిని ఎమ్మెల్యే లోకం నాగమాధవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగరంలో వివిధ ప్రాంతాల్లో రూ.10.79 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. పట్టణంలో పలు డివిజన్‌ల్లో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆమె బుధవారం ఆవిష్కరించారు. అనంతరం బుచ్చన్న కోనేరు వద్ద ఉన్న తూర్పు ప్రాంత తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కేంద్రం వద్ద అదనపు 5 మెగా వోల్టేజీ యాంప్స్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న శుభ తరుణంలో వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోషి కుమారి, కర్రోతు రాధామణి, ఏఎంసీ చైర్మన్ కర్రోతు నర్సింగరావు, కార్పొరేషన్ ఈఈ టి.రాయల్ బాబు, డీఈలు,ట్రాన్స్‌కో ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం కల్యాణవేదిక వద్ద గురువారం చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను జేసీ ఎస్.సేతుమాధవన్ బుధవారం పరిశీలించారు. ఉదయం 6 గంటలకు కల్యాణవేదిక మైదానంలో యోగా ప్రదర్శనలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సుదర్శన రావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ రోగుల నుంచి పైసా తీసుకున్నా చర్యలు

- ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సాయిరాం

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకం ద్వారా చికిత్స పొందే రోగులు నుంచి ఒక్క పైసా తీసుకున్నా సంబంధిత ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కుప్పిలి సాయిరాం స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందే రోగులకు పూర్తి స్థాయిలో ఉచితంగా సేవలు అందించాలన్నారు. కన్సల్టెన్సీ ఫీజులు కూడా రోగులు వద్ద తీసుకోకూడదన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే ఇంప్లెట్స్ ద్వారా మాత్రమే రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. బయట ఇంప్లాంట్స్ గురించి రోగులు వద్ద ప్రస్తావించవద్దన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆసుపత్రికి ఎంతమంది వస్తున్నారు, ఎంతమంది రిజిస్టర్ చేయించుకుంటున్నారు, ఎన్ని కేసులకు రిమార్క్స్ రాస్తున్నారు అని ప్రతీ ఆసుపత్రిలో ఒక నోడల్ అధికారిని నియమించుకుని ప్రతీ రోజు సమీక్ష నిర్వహించాలన్నారు. ఆసుపత్రికి రోగి వచ్చిన వెంటనే రిజిస్టర్ చేయాలన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు అందించే వైద్యులు వారి క్లినిక్‌ల్లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తామని బోర్డులు పెట్టకూడదన్నారు. అదేవిధంగా టీవీల్లోనూ, పత్రికల్లో కూడా ప్రకటనలు ఇవ్వకూడదన్నారు. రోగులు బయట మందులు కొనుగోలు చేస్తే వాటికి అయ్యే ఖర్చు తిరిగి ఇప్పించాలన్నారు. సమావేశంలో జిల్లా మేనేజర్ దూబ రాంబాబు, టీమ్ లీడర్లు తుంపల్లి జనార్ధనరావు, భాను ప్రసాద్, ఆర్.ముత్యాలనాయుడు, పున్నాన దేవి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలను ఉపేక్షించబోం..


విజయనగరంలోని కాలువలు, ఫుట్‌పాత్‌లపై ఎటువంటి నిర్మాణాలను ఉపేక్షించబోమని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. గంజిపేట వద్ద ఉన్న ప్రధాన కాలువ పరిస్థితిని పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను జేసీబీల సహాయంతో ప్రజారోగ్య సిబ్బంది తొలగించారు. కాలువపై ఉన్న తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అందుతున్న ఆహారంపై ఆరా తీశారు.

– విజయనగరం

పనులు పరిశీలించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర కాలుష్య మండలి అధికారులు

విజయనగరం : నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద మంజూరైన నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ డైరెక్టరేట్ శాస్త్రవేత్త డి.సౌమ్య బుధవారం పరిశీలించారు. నగరానికి చేరుకున్న ఆమె బృందం వివిధ ప్రాంతాలలో పర్యటించి ఎస్ కేప్ ద్వారా విడుదలైన నిధులతో చేపడుతున్న ప్రతిపాదిత అభివృద్ధి పనులు, ప్రస్తుత పనులను ఆమె పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేసినట్టు డీఈ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: నిర్మాణాలు పూర్తవకుండా అడ్మిషన్లు చేస్తున్న ప్రదీప్‌నగర్‌లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇ.రాము, ఇజి.వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ విద్య బలోపేతం చేయడం మానేసి కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. గురువారం నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న శ్రీ చైతన్య పాఠశాల నిర్మాణ దశలోనే ఉందని అయినా సరే పాఠశాల యాజమాన్యం ప్రవేశాలు నిర్వహిస్తూ, పుస్తకాల వ్యాపారం కూడా చేస్తుందని విమర్శించారు. పాఠశాలలో కరెంట్ వైర్లు ఓపెన్‌గానే ఉన్నాయని రేపు విద్యార్థులు వచ్చి వారికి ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని దుయ్యబట్టారు. లిఫ్ట్ కూడా నిర్మాణ దశలో ఉందని వారిలో పిల్లలు పడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. దానితో పాటు వాటర్ సదుపాయం కూడా లేదన్నారు. దీనిని అడ్డుకోవాల్సిన డీఈవో మాణిక్యాలనాయుడు కనీసం స్పందన లేకుండా ఉన్నారని విమర్శించారు. ఇప్పటికే జిల్లాలో 10 చోట్ల పుస్తకాలు అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టుకుంటే ఒక్క చోట కూడా చర్యలు తీసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. తక్షణమే కలెక్టర్ అంబేడ్కర్ స్పందించి విద్యార్థుల ప్రాణాలను కాపాడే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చినబాబు, రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, వంశీ, శిరీష, నాయకులు యర్రమ్మ గుణ, మురళి తదితరులు పాల్గొన్నారు.